క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కర్నూలు జిల్లాలో వచ్చే నెల 13, 14 తేదీల్లో జరిగే సబ్ జూనియర్స్, జూనియర్స్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రాజు ఆదివారం ప్రకటించారు. గ్రూప్–1లో కె.ధనుంజయ్, వి.మణికంఠ, కె.సుజన్‌రెడ్డి, కేఎం ముఖేష్, వి.మణికంఠ మనోహర్, షణ్ముఖ శ్రీసాయి ఎంపికయ్యారని తెలిపారు. గ్రూప్–2లో ఎ.అభిసాయి, పి.కౌశిక్ వర్ధన్, ఆర్ఎస్ జాన్, డి.ఆహిల్, కె.విరాజ్, టీవీసీ సాయి సాకేత్, ఆర్.మనోహర్ శ్రీసాయి, ఎస్ఎం అర్జున్, ఎస్‌కే హుస్సేన్, సీహెచ్ సిమ ద్యుతి, పి.దక్షిత, డి.కమల వైష్ణవి, కె.తనుశ్రీ, కె.సోనుప్రియ ఉన్నారని వివరించారు. గ్రూప్–3లో కె.దర్శిల్, ఎస్.కృతిక్, ఎం.సాయిచరణ్, ఎం.షణ్ముఖవీర్, ఎల్.హేమవర్షిత్, ఎం.హర్ష, ఆర్ఎస్ఎస్ఎస్ ధనుష్, ఎం.పల్లవి, కె.శ్యామల, పి.తన్వి, ఎం.యశస్విని, కె.జయశ్రీ, టి.తేజస్వి ఎంపికయ్యారని తెలిపారు. పెద్దాపురం శ్రీప్రకాష్ స్కూల్‌లో జరిగిన ఎంపికలకు డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలస్వామి, కోచ్‌లు ఉదయ్, అజయ్‌కుమార్, వీరభద్రరావు, హరి తదితరులు హాజరయ్యారని రాజు పేర్కొన్నారు.

రేపు ప్రత్యేకాభిషేకాలు


వైభవ వెంకటేశ్వరస్వామివారు

కాకినాడ: స్థానిక సాంబమూర్తి నగర్‌లోని శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో శ్రవణం నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె చక్కెర వంటి పంచామృతాలతోపాటు పసుపు, కుంకుమ, చందనం, పండ్ల రసాలతోపాటు వివిధ రకాల పుష్పాలతో అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం స్వామివారి నిజరూప దర్శనం, తొమ్మిదిన్నర గంటలకు అలంకారం, దర్శనం, అర్చన, మంగళాశాసనాలు, నీరాజన మంత్రపుష్పం నిర్వహిస్తామన్నారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ


రోటరీ ఆశ్రమానికి సౌండ్ సిస్టమ్ అందిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ రూ.30 వేల రూపాయల సౌండ్ సిస్టమ్ , కుర్చీలను బహూకరించడం అభినందనీయం అని రోటరీ ఆశ్రయ వృద్ధాశ్రమం కమిటీ చైర్మన్ టి.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. స్థానిక రోటరీ ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్యానమందిరానికి ఆదివారం సౌండ్ సిస్టమ్ అందించారు. తలాటం హరీష్ మాట్లాడుతూ రోటరీక్లబ్‌కి ఎలాంటి అవసరం వచ్చినా తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్లబ్ సభ్యులు టి.వి.బాలకృష్ణ, చార్మినార్ వర్మ, మమతా శ్రీనివాస్, ఆదిత్య, చందు, సాంబమూర్తి పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం కూల్చివేత హేయమైన చర్య

మాజీ మంత్రి తోట నరసింహం



కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే విధ్వంసాలు సృష్టిస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందన్నారు. అప్పట్లో ఎటువంటి అనుమతులు లేకుండా అనాధికారికంగా నిర్మించిన ప్రజావేదికను కూలగొడితే టీడీపీ నేతలు గగ్గోలు పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతులు తీసుకుని నిర్మిస్తున్న పార్టీ కార్యాలయం కూల్చివేతను ఏమంటారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తుతం ఉంటున్న ఇల్లు కూడా అనాధికారిక స్థలంలోనే ఉందని గుర్తు చేశారు.

నేడు మరిడమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయ హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జాతర ఉత్సవాల్లో భాగంగా ఏటా జాతర ప్రారంభంలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ చైర్మన్, ఆసాదులు, భక్తుల సమక్షంలో హుండీలను లెక్కించనున్నట్లు చెప్పారు.

కీటకాలపై కీలక యుద్ధం

- వ్యాధులను వ్యాప్తి చేయకుండా అరికట్టే చర్యలు
- సీజన్ మార్పుతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తం
- ఇకపై కీటక జనిత వ్యాధులు ఉధృతమయ్యే అవకాశం
- నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు


సాంబమూర్తినగర్ గురుకుల వసతి గృహంలో స్ప్రేయింగ్


కచేరిపేటలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడేలో ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది


నిరుపయోగ నీటికుండీని చూపుతూ పరిశుభ్రతపై ఆదేశాలిస్తున్న డీఎంవో


డెంగీ కేసు గుర్తించిన ఇంటిలో గోడలపై పిచికారీ చేస్తున్న దృశ్యం

కాకినాడ క్రైం: వెక్టర్ బార్న్ (కీటక జనిత) వ్యాధుల విజృంభణకు వాతావరణం అనుకూలిస్తోంది. ఈ సీజన్‌లో ముఖ్యంగా దోమల వల్ల కలిగే వ్యాధులు ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉంది. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. నీటి కాలుష్యానికి, మురుగునీటి నిల్వలకు అవకాశం ఉన్నచోట్ల దోమల సంతాన వ్యాప్తికి వాతావరణం అనుకూలించడంతో నివారణ చర్యలకు అధికారులు పూనుకున్నారు. అనుకున్నదే తడవుగా కట్టుదిట్టమైన ప్రణాళికతో ఆచరణకు సిద్ధమయ్యారు. వ్యాధులను వ్యాప్తి చేసే కీటకాలపై యుద్ధం ప్రకటించారు. అందులో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతున్నారు.

ఈ వ్యాధులకు అవకాశం..

జూన్ మొదలు సెప్టెంబర్ నెలాఖరు వరకు దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యాల వ్యాప్తికి అవకాశం ఉంది. గతంలో డెంగీ మలేరియాల వల్ల మరణాలు కూడా సంభవించిన దాఖలాలు ఉన్నాయి. చెమ్మతో కూడిన వాతావరణం దోమల సంతాన వృద్ధికి దోహదం చేయడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం. రాత్రి కుట్టే దోమల కంటే పగటి వేళ కుట్టే దోమలతో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ చర్యలు..

వెక్టార్ బార్న్ వ్యాధుల నియంత్రణకు కాకినాడ పరిధిలో సేవలందిస్తున్న శాఖ సిబ్బంది, అధికారులు ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తున్నారు. నగరంలో పరిశుభ్రత ఆధారంగా పలు రిస్క్ జోన్లను గుర్తించి ఆయా ప్రాంతాలలో దోమల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, యాంటీ లార్వా పిచికారీ, గంబూషియా చేపలను నీటి వనరుల్లో విడవడం ఇందులో ప్రధానమైనవి. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం దోమల నివారణకు చేపడుతున్న ప్రత్యేక చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. వెక్టర్ హైజీన్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా యాప్‌లో అపరిశుభ్ర పరిసరాల ఫొటోలు తీసి శానిటేషన్ సెక్రటరీకి పంపగా ఆయన సూచనలతో సిబ్బంది శుభ్రం చేసి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. అపరిశుభ్రత ఉన్న ప్రాంతాల ఫొటోలను అప్‌లోడ్ చేసిన ఏఎన్ఎం.. శుభ్రపరచిన అనంతరం ఫొటోలను అందుకొని సంతృప్తిని వెల్లడిస్తారు. ఈ కార్యక్రమం తక్షణ పరిశుభ్రతకు ఎంతగానో సహకరిస్తుంది.

కేసులు గుర్తిస్తే...

డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా కేసులు బయట పడ్డ ప్రాంతాలను రెడ్ జోన్‌లుగా గుర్తించి నాలుగు ప్రత్యేక చర్యలు చేపడతారు. అవి లార్వల్ సర్వే, యాంటీ లార్వల్ ఆపరేషన్, స్ప్రే, ఫీవర్ సర్వే. ఇవన్నీ అక్కడి ప్రాంతంలో నిర్వహించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

ప్రజల్లో నిర్లక్ష్యం...

ప్రజల్లో నిర్లక్ష్యం పలు రకాల వ్యాధులు, అపరిశుభ్రతకు దారి తీస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తిన్న పేపర్లు, డిస్పోజబుల్ ప్లేట్‌లు, ఎంగిలి ఆకులు డ్రైనేజీలు, రోడ్ల పక్కనే విసిరేయడం, ఇంటి చెత్తను చెత్త తరలించే వాహనాలకు అందించకుండా సమీపాన ఉన్న ఖాళీ స్థలాల్లో పడేయడం, నీటి నిల్వకు అవకాశం ఉన్న తాగేసిన కొబ్బరి బొండాలు, తాటి డొప్పలు, ప్లాస్టిక్ కూల్ డ్రింక్ సీసాలను నిర్లక్ష్యంగా రోడ్ల పైనే వదిలేయడం, ఇంటి చుట్టు పక్కల ప్రదేశాలను శుభ్రం చేసుకోవడంలో అశ్రద్ధ లేదా అపరిశుభ్రతపై ఫిర్యాదు చేయకపోవడం వంటివి కీటక జనిత వ్యాధుల వృద్ధికి ప్రధాన కారణాలని అన్నారు.

ఏడు కేసులు

కాకినాడ అర్బన్, రూరల్ పరిధిలో సుమారు ఆరు నెలల వ్యవధిలో మొత్తం ఏడు డెంగీ కేసులు నమోదయ్యాయి. కాకినాడ అర్బన్ పరిధిలో ఐదు, కాకినాడ రూరల్ పరిధిలో రెండు నమోదయ్యాయి. సీజన్ ఇప్పటికే ప్రారంభం కావడంతో కేసులు పెరిగే అవకాశం ఉందని, నియంత్రణకు అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ప్రజలు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- కాచి చల్లార్చిన నీరు తాగాలి.
- నీటి నిల్వలు గుర్తిస్తే తక్షణమే తొలగించాలి.
- వేడి ఆహార పదార్థాలు మాత్రమే తినాలి.
- వాంతులు, విరేచనాలు, అదుపు కాని జ్వరం అయితే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి.
- సొంత వైద్యాలకు దూరంగా ఉండాలి.

ఈ నాలుగు నెలలు కీలకం



వెక్టర్ బార్న్ వ్యాధుల విజృంభణకు ఈ నాలుగు నెలలు అత్యంత కీలకం. సిబ్బందితో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే అన్ని నియంత్రణ చర్యలు తీసుకున్నాం. ఫాగింగ్ పెంచాం. గురుకులాలు, జనసందోహ ప్రాంతాలు, విద్యాలయాలు, వసతిగృహాలలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. దోమల వల్ల కలిగే వ్యాధుల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరం. పారిశుధ్య నిర్వహణ ఇంటింటా జరిగితే వ్యాధుల నియంత్రణకు మరింత అవకాశం ఉంటుంది.

– సింగంశెట్టి భాస్కరరావు, డీఎంవో, కాకినాడ

వృద్ధాశ్రమానికి రూ.20 లక్షలతో లిఫ్ట్


లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న సీ పోర్టు సీఓఓ మురళీధరన్

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామం పరిధిలోని రాయుడుపాలెం గల రోటరీ ఆశ్రయ వృద్ధాశ్రమానికి లిఫ్ట్‌ను రూ.20 లక్షలతో కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసింది. రోటరీ ఆశ్రయ వృద్ధాశ్రమం చైర్మన్ టీవీఎస్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో లిఫ్ట్‌ను సీ పోర్టు సీఓఓ మురళీధరన్ ప్రారంభించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన యోగా హాల్, కిచెన్‌లను మురళీధరన్, డాక్టర్ టీవీ బాలకృష్ణ, డాక్టర్ కామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ ఎంతో మంది వృద్ధులకు ఆశ్రయం ఇస్తున్న వృద్ధాశ్రమంలో లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇచ్చిన రోటరీ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీధరన్‌తో పాటు వృద్ధాశ్రమంలోని వారికి అన్నపూర్ణ పథకం కింద భోజనం ఏర్పాటుకు రూ.30వేల చొప్పున అందించిన దాతలను కాకినాడ గోల్డెన్ జూబ్లీ ప్రెసిడెంట్ నరహరిశెట్టి రవికృష్ణ, వృద్ధాశ్రమం సెక్రటరీ సుబ్రహ్మణ్యం సత్కరించారు. ఆదిత్య, నల్లమిల్లి మాచారెడ్డి, పద్దరాజు, జేకే శ్రీనివాస్, నెక్కంటి శ్రీనివాస్, కుప్పిరెడ్డి సాంబమూర్తి, తమ్మన బోయిన ఏడుకొండలు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు పాటుపడిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ


శ్యాంప్రసాద్‌ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


రమణయ్యపేట మార్కెట్ వద్ద డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: దేశ సమగ్రతకు దివంగత డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఎంతోగానో కృషి చేశారని బీజేపీ సౌత్ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చెల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. తొలు ఆయన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. ముఖర్జీ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలోని మంత్రి పదవికి రాజీనామా చేసి ఈ దేశంలో ఒకే చట్టం, ఒకే జెండా ఉండాలని ఉద్యమించారన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమని ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఉద్యమస్ఫూర్తితో జనసంఘ్‌ని స్థాపించి గొప్ప జాతీయవాద పార్టీగా తయారు చేశారన్నారు. కశ్మీర్‌లో దేశ సమగ్రత కోసం పోరాటం చేస్తూ ఆనాటి కాంగ్రెస్ కుట్రలో బలిదానం అయ్యారన్నారు. ఒకే దేశం ఒకే రాజ్యాంగం అన్న శ్యాంప్రసాద్ ముఖర్జీ ఉద్యమం వృథా పోకుండా ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేసి ఆయన కలలు సాకారం చేశారన్నారు. అటువంటి గొప్ప దేశభక్తుడుకి వారసులుగా శ్యాంప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితో బీజేపీ నాయకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. నాయకులు కె.రాజ్‌కుమార్, పట్నాల వీరవేణి, బందర్‌మిఠాయి నెహ్రూ, రమ్య, వినుకొండ దుర్గాభవానీ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: రమణయ్యపేట మార్కెట్ వద్ద బీజేపీ నాయకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించి, బలిదాన దివస్‌ను జరుపుకొన్నారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ కన్వీనరు పితాని లీలావతి, ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, కాకినాడ పార్లమెంట్ కన్వీనరు రంబాల వెంకటేశ్వరరావు తదితరులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవికొండల భీమశంకర్, అనపర్తి వెంకటేష్, రెడ్డి రమణేశ్వర్, పద్మ, బల్ల సుధాకర్ కాదా మూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాకినాడ 49వ డివిజన్‌లో కవికొండల భీమశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు, ముత్తా నవీన్‌కృష్ణ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు.

పోషకాహారంతోనే రోగ నిరోధక శక్తి


రమణయ్యపేటలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న పోషకాహార నిపుణుడు పార్థసారథి

కాకినాడ రూరల్: వర్షాకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని అందువల్ల ప్రతీ ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని పోషకాహార నిపుణుడు పి.పార్థసారథి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దాహం వేయకపోయినా మంచినీరు తాగాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విటమిన్ – సి ఎక్కువగా ఉండే తాజా పండ్లను తీసుకోవాలన్నారు. కలుషిత నీరు, ఆహారం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, నిల్వ ఆహారం తీసుకోరాదన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, సాధ్యమైనంత వరకు బయట ఆహార పదార్థాలు తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

7న మాదిగ జన జాతర

సామర్లకోట: జూలై 7వ తేదీన నిర్వహించనున్న మాదిగ జన జాతరను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భవించిన ఈదుమూడిలో జనజాతర నిర్వహిస్తున్నట్టు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని తెలిపారు. ఈ మేరకు ఆదివారం భీమవరపు కొత్తపేటలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సీనియర్ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మాదిగ జనజాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాని, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ పోరాటం చేస్తోందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు నందిక చక్రం, ఎంఆర్‌పీఎస్ నాయకులు వేళంగి సత్తిబాబు, శీల సూర్యారావు, చెన్నా రాజు, పైడి రాజు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


సంగీత విభావరిలో పాటలు ఆలపిస్తున్న గాయకులు


జ్యోతి వెలిగించి సంగీత విభావరిని ప్రారంభించిన అతిథులు

బోట్‌క్లబ్: కోన విజయభాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి నగర ప్రజలను మైమరపించింది. గానగంధర్వ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గానం చేసిన సుమధుర గీతాలను 'హాయి.. హాయి... బాలూ పాట హాయి' పేరుతో జరిగిన సినీసంగీత విభావరిలో కాళీకృష్ణ సాయినాథ్ ఆధ్వర్యంలో సంస్థ కళాకారులు ప్రభాకర్, బాబి, రామకృష్ణ, వాణి, నవిత, లలిత, సురభి, భానుప్రకాష్, మురళీ, రేణుక, వైష్ణవి ఆలపించిన పాటలకు ప్రేక్షకులు మైమరచిపోయారు. మార్ని జానకిరామ చౌదరి మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా సంగీత విభావరులతో పాటు సంస్థ చేపడుతున్న అనేక ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు కొనియాడదగినవి అన్నారు. పెద్దాడ సూర్యకుమారి దంపతులను సంస్థ వ్యవస్థాపకులు బి.వి.ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంత పద్మనాభమూర్తి, డాక్టర్ కృష్ణప్రసాద్, నర్సరాజా, దూలం శ్రీనివాసరావు, అమరేశ్వరరావు, గొల్లపల్లి వీరన్న, రామకృష్ణారెడ్డి, ఎతోట సూర్యనారాయణమూర్తి, టి.విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్ డే రన్


ఒలింపిక్ జ్యోతితో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు


రన్‌లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పద్మనాభం తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యాన కాకినాడలో ఆదివారం ఒలింపిక్ డే రన్ ఘనంగా నిర్వహించారు. ఈ పరుగును రాష్ట్ర ఒలింపిక్ సంఘం సీఈఓ చుండ్రు గోవిందరాజు, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.ఎలీషాబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోవిందరాజు మాట్లాడుతూ, ఒలింపిక్ డే రన్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని అన్నారు. శ్రీనివాస్ కుమార్ కూడా ప్రసంగించారు. వర్షం కారణంగా కాకినాడ డీఎస్ఏ బదులు స్థానిక శ్రీనగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఒలింపిక్ జ్యోతి చేబూనిన క్రీడాకారులు, పీడీలు, క్రీడా సంఘాల ప్రతినిధులు భానుగుడి పరిసర ప్రాంతాల్లో రన్ నిర్వహించారు. పాల్గొన్న వారికి ఒలింపిక్ సంఘం తరఫున సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవిరాజు, ఉపాధ్యక్షుడు బి.అర్జునరావు, సభ్యుడు బి.కృష్ణమూర్తి, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎల్.జార్జి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటిన ఒలింపిక్ డే రన్

సెంట్రల్ ఆర్గనైజింగ్ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించారు. అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం జూన్ 23ను పురస్కరించుకుని నిర్వహించిన ఈ రన్‌ను స్థానిక జన్మభూమి పార్కు ఆవరణలో సెంట్రల్ ఆర్గనైజింగ్ ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.పద్మనాభం ప్రారంభించారు. ముందుగా విద్యార్థులతో ఒలింపిక్ ప్రతిజ్ఞను చేయించారు. రన్‌లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎంఏ దీన్, క్రీడారులు, కోచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 17 కేంద్రాల్లో ఈ రన్‌ను నిర్వహించామన్నారు. రన్ నిర్వహణకు సహకరించిన అమలాపురం ఒలింపిక్ అసోయేషన్‌ను ఆయన అభినందించారు.

కూల్.. సండే

- వేకువ జాము నుంచి ఉదయం వరకు వాన
- రోజంతా చల్లగా వాతావరణం

కాకినాడ రూరల్: అసలే సండే.. ఆపై చల్లని వాతావరణాన్ని జనాలు ఆస్వాదించారు. కాకినాడ రూరల్‌లోని గ్రామాలలో వర్షంతో ఆదివారం ఉదయం పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేకువ జామున ప్రారంభమైన చిరుజల్లులు కొద్ది సేపటికి కుండపోతగా మారాయి. ఉదయం వరకు వర్షం పడడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. వర్షం ప్రభావంతో రోజంతా వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా మారింది. వర్షకాలం ప్రారంభమవ్వడంతో డ్రైనేజీలు శుభ్రం చేసి వర్షపునీరు నిల్వ లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని పల్లె వాసులు కోరుకుంటున్నారు. వర్షంతో వ్యవసాయ పనులు ఆరభించవచ్చని రైతులు చెబుతున్నారు. ఏరువాక పౌర్ణమి మరుసటి రోజే వాన రావడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్‌లో ఎక్కువ మంది వెదజల్లు ద్వారా వరిసాగు చేపట్టేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


వాకతిప్పలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప కాపుల రామాలయం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కొత్తపల్లికి చెందిన ముత్యాలమ్మతల్లి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. వీరికి శివరామకృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు ప్రదర్శించిన కోలాటానికి వీక్షకులు ఆకర్షితులయ్యారు.